నిరీక్షణ

-చింతపట్ల గోపిక

బయట వాతావరణం చాలా చల్లగా ఉంది. టైము ఏడున్నర దాటింది. టీ వీ సీరియల్ చూడటంలో పడిపోయారు పిల్లలిద్దరూ. ఇంకా మూర్తి రాలేదు. గాయత్రి చాలా సేపట్నుంచి ఎదురు చూస్తోంది.

అప్పటికే కిటికీ లోంచి ఓ నాలుగు సార్లు, గుమ్మం లోంచి ఓ అరడజను సార్లు చూసింది. సాయంకాలాలు ఆయన రావడం తరచు ఆలస్యమవుతూనే ఉంది. ప్రతిసారి గాయత్రి అలా ఎదురు చూడటం - అందుకు మూర్తి ఏదో చెప్పటం. ఎదురింట్లో ఫోన్ ఉంది. వాళ్లూ ఎంతో మంచి వాళ్లు. ఆఫీసు నుండి ఒక్క ఫోన్ కాల్ చేయలేరా ఆలస్యమవుతుందని. ఈ నిరీక్షణ తప్పుతుంది కదా! ఎనిమిది కూడా దాటింది. ఇంకా రాలేదు. కాళ్ళూ చేతులు దడదడ లాడుతున్నాయి గాయత్రికి. ఎన్నో రకాలైన ఆలోచనలు తేనెటీగల్లా ముసురుతున్నాయి.

ఎక్కడైనా యా...క్సి...డెంట్! ఛీ! ఛీ! ఏమో! మూర్తిది చాలా స్పీడ్ డ్రైవింగ్. ఒకటి రెండుసార్లు యాక్సిడెంట్ వెంట్రుకవాసిలో తప్పింది. ఆ విషయం గుర్తు చేస్తే చాలా తేలిగ్గా తీసుకుంటారు. ఆ ఆలోచనకు నవ్వుతారు కూడా. జరగకూడదని ఏముంది. ఆయన జాగ్రత్తగా ఉంటే చాలా? అవతల వాళ్లో? ఐనా రోడ్లు ఎంత అధ్వాన్నంగా ఉన్నాయో! ఆయన కెలా చెప్పాలో అర్థం కావడం లేదు. ఎవరో వచ్చినట్లు అలికిడి. చూస్తే ప్రక్క పోర్షన్ వాళ్ళకోసం. మళ్ళీ నిరాశ. టీవి దగ్గరికి వచ్చింది గాయత్రి. "అమ్మా నువ్వు కూడా కూర్చోవచ్చుగా. నాన్న వస్తారులే" ద్విజ అంది. గాయత్రి కుర్చీలో కూలబడింది. టీవి కళ్ళముందే ఉన్నా దృష్టి మరెక్కడో! బయట విపరీతమైన చలి. ద్విజ కాళ్లూ చేతులు ముడుచుకొని కూర్చొని టి.వి. చూస్తోంది. గాయత్రి లేచి కిటికీ తలుపులూ వేసి వచ్చి కూర్చుంది.

టైము తొమ్మిది. గేటు దగ్గర స్కూటర్ ఆగిన చప్పుడికి ఆమెలో ఎక్కడలేని బలం వచ్చింది. పెళ్ళయి పదేళ్లు దాటినా గాయత్రిలో భర్త కోసం అదే ఆత్రుత. "ఏమిటింత ఆలస్యమైంది? ఎప్పటినుంచి ఎదురు చూస్తున్నానో తెలుసా?". కాస్త కోపంగానే అంది. గోడకు పెద్ద గడియారం వ్రేలాడుతున్నా చేతి వాచి వంక చూసుకొన్నాడు. "ఇంత టైమ్ అవుతుందనుకోలేదు. ఆఫీసులో పెండింగ్ వర్క్ ఉండిపోతేనూ..." తన కోపానికి తనే ఫీలయ్యింది గాయత్రి. 'బయట చలిలోంచి వచ్చారు పాపం' అనుకొన్న గాయత్రి భర్తకు టీ కలిపిద్దామని వెళ్ళ బోతుంటే—"దేనికీ" అడిగాడు.

"టీ" అంది.

"ఇప్పుడేంవద్దు, భోంచేద్దాం"! అన్నాడు.

* * *

చీకటి పడి చాలా సేపయింది. మూర్తింకా రాలేదు. వర్షం పడే సూచనలున్నాయి. గాయత్రి నిరీక్షిస్తుండగానే మూర్తి వచ్చాడు. వచ్చి రెండు నిముషాలన్నా కాలేదు. బయట విపరీతమైన వర్షం. "చూశారా! కాస్త ఉంటే తడిసిపోయేవారు. రెయిన్ కోట్ తీసుకెళ్లమంటే బద్ధకం" అంది గాయత్రి.

"డాడీ! వర్షం వచ్చినప్పుడు స్కూటర్ జాగ్రత్తగా డ్రైవ్ చేయాలి. ఏం"? ముద్దు ముద్దు మాటలతో ద్విజ అనగానే గాయత్రికి నవ్వొచ్చింది. "ఎందుకానవ్వు? నీ కూతురిని బాగానే బ్రైన్ చేస్తున్నావ్" "మీ కూతురే"! అంది నవ్వుతూ. మూర్తీ నవ్వేశాడు.

* * *

వారం తరువాత మళ్ళీ ఒక రోజు. తొమ్మిదయింది. ఎదురు చూసిన గాయత్రి ఎదురింటికి వెళ్ళి ఆఫీసుకు రింగ్ చేసింది. రింగవుతూనే ఉంది. కానీ రెస్పాన్స్ లేదు. బయట వర్షం ప్రారంభమైంది.

"అమ్మా! నాన్న ఇంకా రాలేదేమిటి?" ద్విజ అడిగింది.

"నువ్వింక పడుకోమ్మా! మళ్ళీ రేప్పొద్దున పరీక్ష కూడా ఉంది." అంది గాయత్రి.

రేడియోలో 'చిత్రసీమ'. టైమ్ పదిన్నర. ఏమిటీ వేళ? ఏం చేయాలి? ఏమైనట్లు? సంవత్సరం క్రితం మూర్తికి జరిగిన చిన్న ఆక్సిడెంట్ గుర్తొచ్చి భయమేసింది. ఇపుడు కూడా అలా...? ఛీ! ఛీ! పాడు ఆలోచనలు! ఎంత కాదనుకున్నా వద్దనుకున్నా మనను ఇలాంటి సందర్భాల్లో కీడే శంకిస్తుంది. ఏమిటి చేయటం? ఏడుకొండలవాడి పటానికి దణ్ణం పెడుతుండగా స్కూటర్ చప్పుడు.

ఓ పెద్ద రిలీఫ్! ఓ నిట్టూర్పు. కళ్ళలోంచి అప్రయత్నంగా బయటికొచ్చిన నీటి బొట్లని తుడుచుకొని తలుపు తీసింది.

"ఏమిటండీ! ఏమైంది"? బాధ, నిరాశతో బొంగురు బోయిన కంఠంతో అంది.

"ఏమిటిది గాయత్రి?" కళ్ళల్లో దాగిన నీటిని పసిగట్టి నవ్వాడు.

"ఎందుకింత వర్రీ అవుతావు? నేను కుమార్ దగ్గరికి వెళ్ళి, అతని కివ్వాల్సిన రిజిస్ట్రేషన్ తాలూకు కాగితాలవీ ఇచ్చాను".

"వానలో ఎందుకు వెళ్లడం? ఇంటి కొచ్చెయ్యొచ్చుగా. రేపు వెళ్ళే వాళ్ళు".

"నేను బయలుదేరినప్పుడు బానేవుంది. ఆ తరువాతే...?"

"అక్కడి కెడుతున్నప్పుడు కనీసం ఫోనైనా చెయ్యొచ్చుగా?"

"అంత ఆలోచించలేదు. గాయత్రీ"!

"అవును ఎందుకు ఆలోచిస్తారు"? నేనిక్కడ ఎంత తలక్రిందలవుతున్నానో..." అంటూ తన బాధను వెళ్ళబుచ్చింది.

* * *

అయిదు దాటిందేమో - గేటు ముందు స్కూటర్ లోపల పార్క్ చేసి హుషారుగా మెట్లెక్కాడు. తలుపు వేసే ఉంది. బెల్ నొక్కాడు. 'సాధారణంగా తెరచి ఉండే తలుపు వేసుందేమిటి' అని అనుకుంటూండగానే ద్విజ తలుపు తీసింది.

"ఎంత సేపయింది. డాడీ వచ్చి!" అంది.

"అమ్మ ఏదీ?" అని అటూ ఇటూ చూశాడు.

"నాకు తెలియదు, బయటికి వెళుతున్నాను అని చెప్పింది".

"ఎక్కడికి?" అన్నాడు.

"బజారుకేమో!" అంది. వస్తుందేమో అని కాసేపు చూశాడు. అదే మొదటి సారేమో! ఆరున్నర కూడా ఐపోయింది. గాయత్రి జాడ లేదు. అతనిలో సహనం చచ్చిపోయింది. అప్పటికే వాచీ ఎన్నిసార్లు చూసుకొన్నాడో అతనికే తెలియదు. మళ్ళీ ద్విజను పిలిచి అడిగాడు చిరాగ్గా—

"ఎక్కడికి వెళ్ళిందో చెప్పలేదా? మార్కెట్‌కు వెళితే ఇంతసేపా?" రెండూ తనే అన్నాడు.

"మరెక్కడికైనా వెళ్ళిందేమో!" ద్విజ చెప్పేసి వెళ్ళిపోయింది.

అసహనంగా కుర్చీలోంచి లేచాడు మూర్తి. "చూడు

ద్విజా! నేను మార్కెట్‌కు వెళ్లి అమ్మను తీసుకొస్తానేం?" అని బయలుదేరాడు. అరగంట తిరిగి తిరిగి కనబడక ఇంటికొచ్చేశాడు. ఎక్కడా కనిపించలేదు. ఎప్పుడూ కూరలుకొనే కొట్లోనూ, సరకులు తీసుకొనే కొట్లోను అడిగాడు. రాలేదన్నారు.

తొమ్మిదయింది. తెలిసున్న వాళ్ళకు ఫోన్ చేశాడు. రాలేదన్నారు. హడావుడిగా చుట్టుప్రక్కల వాళ్ళ ఇళ్ళకు వెళ్లాడు. "పోనీ ఓ పని చేయండి. మరో గంట చూసి పోలీసులకి తెలియజేయండి" అని సలహా వచ్చింది. 'అదే కరెక్ట్' అనుకున్నాడు మూర్తి. పోలీస్ కంప్లెయింట్ ఏమనివ్వాలి? ఎలా ఇవ్వాలి? కాగితం, పెన్నూ తీసుకొని రాయడం ప్రారంభించాడు. ఇప్పుడు ఈ కంప్లయింట్ ఇస్తే - "మీరు మీ భార్యతో పోట్లాడారా? ఏమైనా సమస్య లున్నాయా? కట్నం తాలూకు గొడవలా?" ఇలా ప్రశ్నలు వేసి ప్రాణం తింటారు. ఇంత కంగారు పడుతుంటే టి.వి. చూస్తూ ఎంత నిశ్చింతంగా ఉంది ద్విజ! కోపం వచ్చింది.

కంప్లెయింట్ పట్టుకొని ఇక బయటకు వెడదామనుకొంటుండగా కాలింగ్ బెల్ మ్రోగింది. దేవుడా గాయత్రే అయి ఉండాలి! గాయత్రే! నవ్వుతూ నిలబడింది.

"ఎక్కడికెళ్ళావ్"? అన్నాడు మూర్తి విసుగ్గా.

"చెబుతాను. కూర్చోనివ్వండి. బస్‌స్టాపు నుండి పరుగెత్తుకుంటూ వచ్చాను. ఆయాసంగా ఉంది" అంది.

"ఎక్కడికెళ్ళావు?" మళ్ళీ అదే ప్రశ్న.

"మీరు భోంచేశారా?' అంది గాయత్రి.

"పిచ్చిగా ఉందా? నేనేం అడుగుతున్నాను. నువ్వేం చెబుతున్నావు నీగురించి భయపడి ఛస్తుంటే..." అన్నాడు.

"రవీంద్ర భారతిలో పాట కచేరీ ఉంటేనూ..." సమాధానం ఇంకా పూర్తి కానేలేదు.

"ఏమిటీ? ఒక్క దానివే..."అన్నాడు మూర్తి.

"అవునండీ! నాకేమో చూడాలని ఉంటుంది. మీకేమో కుదరదు. అయినా ఇంత ఆలస్యమవుతుందనుకోలేదు. బస్సు చాలాసేపు దొరకలేదు" అంది సంజాయిషీగా.

"ప్రక్క వాళ్ళకో, ఎవరికైనా చెప్పొచ్చుగా? నేనొచ్చి పికప్ చేసుకొనేవాడిని" అన్నాడు మూర్తి.

"నేను అనుకోకుండా వెళ్ళానండీ! పైగా ఆ ప్రోగ్రాం ఎప్పుడు ఐపోతుందో తెలియదు. ఎంత బాగుందో తెలుసాండీ?" అంది.

"పిల్లల గురించి మర్చిపోయావా? వాళ్ళెంత వర్రీ అవుతున్నారో!" టీ.వీ ఆఫ్ చేసేసిన ద్విజ మంచం మీద పడుకొని కొంటెగా చూస్తోంది.

"వాళ్ళకి తెలుసు" నవ్వింది.

"కానీ ద్విజా..." ఏదో మాట్లాడబోయేంతలోనే, గాయత్రి అందుకొంది, "అవును, నేనే చెప్పొద్దని చెప్పాను".

"ఎందుకు?" అన్నాడు మూర్తి.

"మీకు నిరీక్షణ అర్థం కావాలని" అంది చిన్నగా నవ్వుతూ.

కొద్దిగా కోపం వచ్చినా పరిస్థితి అర్థమైందతనికి. నిరీక్షణలో ఉండే బాధను అర్థం చేసుకోగల్గాడు.

★

కన్నీ ధన్నీ

కొత్త సామెతలు

ఆదర్శం కొద్దీ కట్నం వద్దంటే అనుమానంగా చూచినట్టు.

* * *

ఎంత గొప్ప ఫేన్ అయినా ఎలెక్ట్రిసిటీ లేనిదే తిరగదు.

* * *

ఆరు గజాల చీర కోసం, అరవై అంగళ్లు గాలించినట్టు.

* * *

చీర దొరికినా మాచింగ్ జాకెట్టు దొరకనట్టు.

* * *

పేరంటాలలో పెట్టే రవిక బట్టలు ఇచ్చుకోడానికే తప్ప కుట్టుకోడానికి కావు.

కూర పాత్రలు

గత సంవత్సరం సినీనటుడు స్వర్గీయ త్యాగరాజుగారు ప్రొద్దుటూరు వచ్చినప్పుడు, శ్రీకామిశెట్టి సుబ్బారావుగారు విందు ఏర్పాటు చేశారు. ఆ విందులో ప్రముఖ కవి నరాల రామారెడ్డిగారు కూడా వున్నారు. అప్పుడు ఎవరో "ఏమండీ, ఇంకా మీకు క్రూరపాత్రలంటేనే యిష్టమా?" అని అడిగారు. అప్పుడు త్యాగరాజుగారు వంకాయకూరను పాత్రనుండి వడ్డించుకుంటున్నారు. అది విన్న రామారెడ్డిగారు, "కనిపించడం లేదూ, ఇప్పుడాయనకు కూర పాత్రలంటేనే యిష్టం" అన్నారు చలోక్తిగా. అందరూ హాయిగా నవ్వుకున్నారు —.

— వి. విజయలక్ష్మీరెడ్డి, ప్రొద్దుటూరు

ఎందుకు?

నర్జన్లు మాస్కులు ఎందుకు ధరిస్తారు?
(ఆపరేషన్ ఫెయిలైనా ఎవరు తప్పు చేశారో తెలీకుండా)

* * *

ఈవ్‌కన్నా ఆడంని దేవుడు ఎందుకు మొదట సృష్టించాడు?
(కాస్త నోరు విప్పి మాట్లాడే అవకాశం ఇవ్వటం కోసం)

* * *

ఆర్టిస్టులు తమ పెయింటింగ్ క్రింద సంతకాలెందుకు చేస్తారు?
(వారి మాష్టర్ పీస్‌కి తలా తోకా ఎటో తెల్పటానికి)

— అచ్యుతుని రాజ్యశ్రీ, బెంగళూరు

అనర్థాలు :

అర్థాలు: తెలుగు సినిమా పాటలలో వెతకరానివి.

ఖరీదైన చీర: 1. కష్టాల్లో ఉన్నప్పుడు తెలుగు సినిమా కథానాయిక ధరించేది.

2. ఇరుగు పొరుగు వారికోసం కొందరు ఇల్లాళ్లు ధరించే వస్త్ర విశేషం.

3. బట్టల షాపులో బొమ్మ మీద ఉన్నప్పుడు చాలా బాగుందనిపించేది.

పట్టుచీర: చాలా సందర్భాలలో 'పట్టు'పట్టికొనే ఒక వస్త్ర విశేషం.

వయస్సు: ఎప్పటి కప్పుడు పెరుగుతూ ఉంటుంది కనుక ఇంత అని కచ్చితంగా చెప్పలేని కాల ప్రమాణం.

తలనొప్పి: 1. కొత్త కోడలు సినిమాకు, వెడితే కొందరు అత్తగార్లకు వచ్చేది.
2 తల ఉన్నందుకు గుర్తు.

కాలెండర్: ఉచితంగా పొందితే తప్ప సంతోషం కలిగించనిది.

-పి.ఎస్.జి.

అదికాదు అర్థం!

ఆగస్టునెల 'వనిత' అట్టమీద–డి. కామేశ్వరి సమాధానాలు - వివాహిత స్త్రీల పాలిటి శాపం! అనివుంది.

వివాహిత స్త్రీలు కామేశ్వరి గారి సమాధానాలు చదవవద్దని చెప్పటమా?

— సుందరి, కడప

కాదు. వేటికవే చదువుకోవాలి. కాని మీ సెన్సాఫ్ హ్యూమర్‌కి అభినందనలు.

వే.సం॥

ఇస్తినమ్మ వాయనం....

బస్టాండ్‌లో ఇద్దరు గ్రామస్థులమధ్య సంభాషణ యిది:

మొదటి వ్యక్తి: ఇప్పటి ఎమ్.ఎల్.ఏతో మా ఊళ్ళోని ఓట్లన్నీ మీకే వేయిస్తానని చెప్పి ఐదు వందలు తీసుకున్నాను. కానీ ఇప్పుడు వదిరెట్లు నా దగ్గర అడుగుతున్నాడు.

రెండో వ్యక్తి: ఎందుకు?

మొ.వ్య: మిమ్మల్ని గెలిపించడానికి నేనూ కష్టపడ్డానుగా...మా అబ్బాయికి ఏదైనా ఉద్యోగమిప్పించండి అన్నాను. "దాన్దేముందీ ఓ ఐదు వేలు మీవి కావనుకోండి...అలాగే ఉద్యోగం యిప్పిస్తాను" అంటున్నాడు.

రెం. వ్య: అందులో ఆయన తప్పేముంది... ముందు నువ్వు తీసుకున్నావు. ఇప్పుడు అతను చక్రవడ్డీతో సహా అడుగుతున్నాడు అంతే!

-గిరిజ, సూళగిరి